




# కరపత్రం

SINCE 2014

సోమవారం జూన్ 15, 2026 | సంపుటి : 2 | సంచిక : 243 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## వర్షమొస్తే అధికారులంతా రోడ్లపై ఉండాల్సిందే..

### అవసరమైతే నేనూ వస్తా: రేవంత్‌రెడ్డి

- వర్షాలపై అధికారులకు సీఎం వార్నింగ్.
- వర్షమొస్తే అందరూ రోడ్లపైనే ఉండాలి.
- అవసరమైతే నేనూ ఫీల్డ్‌లోకి వస్తా: రేవంత్.
- నీటి నిల్వలు, ట్రాఫిక్‌పై కఠిన చర్యలు.
- శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి.
- నిర్లక్ష్య అధికారులపై చర్యలు.
- విద్యుత్, ట్రాఫిక్ శాఖలు అప్రమత్తం.
- బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి.




హైదరాబాద్:
వర్షాల సమయంలో హైదరాబాద్‌లో మున్సిపల్, పోలీసు సిబ్బంది మధ్య సమన్వయం కొరవడిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వర్షాలు, ప్రకృతి విపత్తులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని.. సీఈలు, ఎస్ఈలు స్థానికంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆదేశించారు.

"జూన్ 1న నిర్వహించిన సమీక్షలో వర్షాలపై ముందస్తు సూచనలు చేశాను. 9న వర్షం పడినప్పుడు అధికారులు సరిగా పనిచేయలేదు. హైదరాబాద్‌లో మున్సిపల్, పోలీసు సిబ్బంది మధ్య సమన్వయం లేదు. నీరు నిలిచే ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్ల డేటా ఆధారంగా పనిచేయాలి. విద్యుత్‌శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి. ఫీల్డ్‌లో ఉండని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వర్షమొస్తే ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపై ఉండాల్సిందే. అవసరమైతే నేనూ వస్తా. వర్షంతో నీరు నిలిచి ట్రాఫిక్‌జామ్ ఏర్పడితే కఠిన చర్యలు తప్పవు. ట్రాఫిక్ విభాగంలో తక్షణమే ఖాళీలు భర్తీ చేయాలి" అని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు.

## సంక్షోభం లేదు.. దేశం దూసుకుపోతోంది.

- రాహుల్ విమర్శలు వాస్తవాలకు దూరం.
- పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్యా భారత్ పురోగతి.
- మోదీ పాలనలో అభివృద్ధి-సంక్షేమం.
- యూపీఐ ప్రపంచానికి మోడల్.
- పేదరిక నిర్మూలనలో కీలక పురోగతి.



దేశ ఆర్థిక వ్యవస్థ, కుటుంబాల సంక్షేమం విషయంలో తాము చూపిస్తున్న శ్రద్ధను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించలేకపోతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆయన లోక్‌సభలో మాట్లాడిన ప్రతిసారీ కేవలం విమర్శలకే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ, కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే క్రమంలో.. దేశం సాధించిన విజయాలను ఆయన తక్కువ చేసి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని ఈమేరకు ప్రసంగించారు.

"భారీ విపత్తు ముంచుకొస్తోందని, రాబోయే కొద్ది వారాల్లో అంతా కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ తరచూ అంటుంటారు. ఆయన చెబుతున్నట్లుగా దేశంలో ఎటువంటి సంక్షోభం లేదు. ఆర్థిక వ్యవస్థ ఏటికేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. జీడీపీ గణాంకాలూ దీనిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా ఇదే విషయాన్ని పేర్కొంది. అయినప్పటికీ.. భారత్ సంక్షోభంలో ఉందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనూ దేశం ప్రగతి పథంలో సాగుతోంది. ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు.

మోదీ నేతృత్వంలో భాజపా 12 ఏళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమంతో సాగింది. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల కింద 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించాం. ప్రస్తుతం దేశంలో 58 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. 144 కోట్ల ఆధార్‌లు, 125 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలకు 'యూపీఐ' ఓ నమూనాగా మారింది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి




హైదరాబాద్
హైదరాబాద్‌లోని బాగలింగంపల్లి లో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం విస్తృత స్థాయి రాష్ట్ర సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఈసమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు చిరంజీవులు మాట్లాడుతూ,

మిగతాది 2లో



## తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షాలు!

హైదరాబాద్:
తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని.. నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇవాళ, రేపు, ఎల్లుండి కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## మెట్రో రెండో దశకు కేంద్రం ఆమోదం - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అంబర్‌పేట:
కేంద్ర ప్రభుత్వం మెట్రో రెండో దశకు ఆమోదం తెలిపిందని.. 50 శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి భాజపా ఎంపీలు రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

## 'హైడ్రా లాంటి అరాచక చర్యలపై పోరాడుతున్నాం'

- కేసీఆర్ రావాలని ప్రజల కోరిక.
- హనుమకొండలో హరీష్ పర్యటన.
- విద్యార్థులకు చేయూత.
- హైడ్రాపై హరీష్ ఫైర్.
- అరాచకాలపై బీఆర్ఎస్ పోరాటం.
- గురుకులాలే మార్పుకు కారణం.



హనుమకొండ:
రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలు, అరాచకాలపై పోరాటం చేస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు స్పష్టం చేశారు. హైడ్రా లాంటి అరాచక చర్యలపై పోరాడుతున్నామన్నారు హరీష్‌రావు. బాలకార్మిక వ్యవస్థ తగ్గడానికి కేసీఆర్ పెట్టిన గురుకులాలే కారణమన్నారు. కాంగ్రెస్ పోవాలని, కేసీఆర్ రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. హనుమకొండలో హరీష్ రావు పర్యటించారు. బీఆర్ఎస్ యువనేత రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలలో హరీష్‌రావు పాల్గొన్నారు. దీనిలో భాగంగా పేద విద్యార్థులకు చేయూత, స్కూల్ బాగ్స్ పంపిణీ కార్యక్రమం ఉంటుంది,. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

## 'మీనాక్షికి సీఎం రేవంత్ వెన్నుపోటు పొడిచారు'

- రేవంత్‌పై కేటీఆర్ ఫైర్.
- మీనాక్షికి వెన్నుపోటు ఆరోపణ.
- కాంగ్రెస్ హామీలు బూటకమని విమర్శ.
- హైడ్రాపై మండిపడ్డ కేటీఆర్.
- ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.
- బీఆర్ఎస్ విజయంపై ధీమా.



2లో..

హైదరాబాద్:
మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ వెన్నుపోటు పొడిచారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ దొంగ కేసులుపెట్టించారని.. ఇక్కడి కేసు విషయాలు రేవంత్.. బీజేపీ నేతలకు చెప్పారంటూ ఆరోపించారు.

## ఖరీఫ్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన మంత్రి తుమ్మల

- తక్కువ నీటితో సాగయ్యే కందులు, పెసలు, మినుములు వంటి పంటలను ప్రోత్సహిస్తున్నాము
- ఈ ఖరీఫ్ కు 87 లక్షల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి
- రైతులకు మరింత సౌకర్యవంతంగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో మార్పులు
- ఎల్.ని.నో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- వాతావరణ సమాచారాన్ని నేరుగా రైతులకు చేరవేసే తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం విజయవంతం

ఖరీఫ్ సన్నద్ధతపై ఈ రోజు ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ఏప్రిల్ నెలలోనే వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులతో సమీక్ష నిర్వహించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. వర్షాలు ఆలస్యమైనా, తక్కువగా నమోదైనా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు.



మిగతాది 2లో

## కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్ చర్చకు రావాలి: రామచందర్‌రావు



హైదరాబాద్:
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కుటుంబమే బాగుపడిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. అంబర్‌పేటలో నిర్వహించిన భాజపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. "జీహెచ్ఎంసీ మూడు కార్పొరేషన్లు అయింది. 3 కార్పొరేషన్లలో భాజపా గెలిస్తే అభివృద్ధి జరుగుతుంది. కాంగ్రెస్ సర్కార్ పంట కొనుగోలు చేయకపోతే ఒత్తిడి తీసుకొచ్చాం. పండిన పంటలో కేంద్ర ప్రభుత్వం సగం కంటే ఎక్కువే కొనుగోలు చేసింది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి. సీఎం వస్తే సచివాలయం ఎదురుగా గణాంకాలతో వివరిస్తా. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి భాజపాను ఓడించాలని చూస్తున్నాయి" అని రామచందర్‌రావు అన్నారు.

# ఖరీఫ్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి



వరి పంటలపై అధికంగా ఆధారపడకుండా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. విత్తనాల కొరత తలెత్తకుండా ఈ ఖరీఫ్ సీజన్‌కు 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని, ముఖ్యంగా కందులు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను జిల్లాల్లో ముందుగానే నిల్వ చేసినట్లు మంత్రి వివరించారు.

రాష్ట్రంలోని రైతులకు ఎరువుల లభ్యతను మరింత సులభతరం చేయడం, పంపిణీ ప్రక్రియలో పారదర్శకతను పెంచడం లక్ష్యంగా వ్యవసాయశాఖ పలు కీలక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రబీ సీజన్‌లో రైతుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాల ఆధారంగా రాష్ట్ర ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో పలు మెరుగుదలలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్వహణ, మండల మ్యాపింగ్ సదుపాయాలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. యాప్ వినియోగంతో ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ తగ్గడంతో పాటు పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని మంత్రి తెలిపారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వ్యవసాయశాఖ ముందస్తుగా పంటల ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతులకు సాంకేతిక సూచనలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయశాఖ సూచనలను పాటించాలని కోరారు.

రైతులకు ఖచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు వ్యవసాయ శాఖ "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం"ను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలి వేగం తదితర వాతావరణ వివరాలు రైతులకు నేరుగా వాట్సాప్ సందేశాల ద్వారా చేరుతున్నాయని చెప్పారు. రైతులు విత్తనాలు వేయడం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ వంటి అంశాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.

తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 28 లక్షల మందికి పైగా రైతులకు వాతావరణ సమాచార సందేశాలు పంపించినట్లు చెప్పారు. 71 శాతం డెలివరీ రేటుతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఇటువంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

**సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్**
**టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక**
**యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ**
**అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు**

తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం

కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే

టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరఫున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలనుకుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

## ఆర్‌జికెలో ప్రవేశాలకు ఎంపిక
## తాత్కాలిక జాబితా విడుదల చేసిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక పక్రియ పూర్తి చేశారు. మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ - 9552300009ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్
## కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

## ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

## కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

**- స్థానికుల ఆందోళన.. కంపెనీ ముందు ధర్నా**

నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన కారు కిందే బాలుడు శివం పడిపోయాడు. తీవ్ర గాయాలయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కంపెనీ ఎదుట బైఠాయించి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. న్యాయం జరిగేలా చూస్తామంటూ పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శ్రీశైలం అమ్మవారికి భారీ విరాళం

**- కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత**

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. కోటి రూపాయలు విలువచేసే బంగారు, వెండి వస్తువులను మల్లన్న స్వామికి దాతలు సమర్పించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ దంపతులు వెండి వస్తువులు, బంగారు అభరణాలను స్వామిఅమ్మవార్లకు సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. బంగారు నామాలు, చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు, బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను సమర్పించారని ఈఓ తెలిపారు. వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు ఉండగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానానికి దాతలు అందజేశారు.

## తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమం స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, వనరులపై నియంత్రణ, బడ్జెట్ లో వాటా,రాజకీయ అధికారం సాధించడమే లక్ష్యంగా "హిస్సా -- ఇజ్జత్ -- హుకూమత్" నినాదంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గత ఎనిమిది దశాబ్దాలుగా బీసీ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక , సాంస్కృతిక అన్యాయాలను ఆయన వివరించారు. బీసీలు సంఘటిత శక్తిగా ఎదిగి రాజ్యాధికారాన్ని సాధించాల్సిన అవసరం ఉందని, రాజ్యాధికారం లేకుండా ఏ సమాజమైనా తన అస్తిత్వాన్ని, అభివృద్ధిని కాపాడుకోలేదని అన్నారు.

ఈ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బెనర్జీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్ బాబు, ప్రొఫెసర్ సాయిలు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ ప్రసాద్ గౌడ్, ప్రొఫెసర్ వీరస్వామి తదితరులు పాల్గొని బీసీ ఉద్యమ దిశ, దశ, భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సంబంధించిన కమిటీల సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అలాగే బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్లుగా చెన్న శ్రీకాంత్, అవ్వారు వేణు, ఎర్రమాద వెంకన్న, లింగేష్ యాదవ్‌లకు నియామక పత్రాలు ప్రదానం చేశారు. అదేవిధంగా జూతీశీట బెనర్జీ ని రాష్ట్ర వైస్ చైర్మన్ గా ,జూతీశీట విజయ్ బాబు ను పొలిటికల్ అడ్వైజర్ గా నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో బీసీ ఉద్యమ విస్తరణ, సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, భావజాల ప్రచారం, శిక్షణా కార్యక్రమాలు మరియు రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

## 'మీనాక్షికి సీఎం రేవంత్ వెన్నుపోటు పొడిచారు'

మొదటిపేజీ తరువాయి

"రేవంత్ పాలనకు సగం సమయం ముగిసింది. రేవంత్ సినిమాకు ఇంటర్వెల్ అయిపోయింది. ఇక శుభం కార్డే. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. త్వరలోనే ఎమ్మెల్యే దానం నాగేందర్ పదవి పోతుంది. వచ్చే ఎన్నికల్లో ఖైరతాబాద్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"శనివారం, ఆదివారం వస్తే హైడ్రా పేరుతో వందలాది ఇళ్లు కూలగొడుతున్నారు. మొదటి ఏడాదిలో రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్నాడు. రాహుల్ గాంధీ అశోక్‌నగర్ వచ్చి చాయ్ తాగుతూ ఫోజులు కొట్టి నిరుద్యోగుల ముందు చెప్పారు. రేవంత్ సర్కార్.. ఇప్పటివరకు 4 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మీనాక్షి నటరాజన్ నిజాయితీగల మనిషి.. రాహుల్ గాంధీకి నమ్మిన బంటు. రేవంత్‌రెడ్డి భూములు, కాంట్రాక్టులు అమ్ముకుంటున్నాడని మీనాక్షి నటరాజ్ రాహుల్‌కి చెప్పింది." అంటూ కేటీఆర్ చెప్పుకొచ్చారు.

## మెట్రో రెండో దశకు కేంద్రం ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సమయంలో రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీలు ఇచ్చిన హామీల ఆధారంగానే ప్రజలు ఓట్లు వేశారని.. రెండున్నరేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆదివారం అంబర్‌పేట ఛేనంబర్ చౌరస్తా మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాలులో జరిగిన భాజపా అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని, అందుకు నిధులు అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నగరవాసులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.

## ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో లింగనిర్ధారణ డెకాయ్ ఆపనరేషన్‌లో గుర్తించిన పోలీసులు

వనస్థలిపురంలో లింగ నిర్ధరణ పరీక్షల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హయగ్రీవ ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఈ విషయం బయట పడింది. తొలుత మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపించారు. లింగనిర్ధరణ పరీక్షల గురించి ఆరా తీయగా.. చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్, రిసెప్షనిస్ట్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమెను తుక్కుగూడ ల్యాబ్ టెక్నీషియన్ వద్దకు రిఫర్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీసాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్‌కు చేరుకున్న పోలీసులు.. అక్కడ లింగ నిర్ధరణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హయగ్రీవ ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజు, లోకేశ్, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతికూల వాతావరణం శంషాబాద్ విమానాల దారి మళ్లింపు

భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, దిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్
## 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 15, 2026

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు సరిపెల్లి నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కోశాధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగాల పర్మినెన్సీ, వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18, 19 తేదీల్లో నిరాహార దీక్షలు, 22న కలెక్టరేట్ ముట్టడి, 29, 30 తేదీల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొబ్బల లచ్చయ్య, సావనపల్లి శ్రీనివాస్, సత్తయ్య, గంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలి

గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి

- బీసీ విద్యార్థి సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి నరేంద్ర డిమాండ్ చేశారు
- విద్య తో పాటు వైద్య రంగం కూడా ప్రైవేట్ పరం అయిపోయింది.



రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా ప్రవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయిందని, ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను ప్రభుత్వం గాలికొదిలేసిందని బీసీ విద్యార్థిసంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి నరేంద్ర విమర్శించారు.

ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు ఏటా రూ 25 వేల కోట్ల వ్యాపారం చేస్తున్నాయని, సామాన్యులకు విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలు కాలేజీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని టీచర్ ల కొరత వేధిస్తున్నదని మండిపడ్డారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని కార్పోరేట్ ఆస్పత్రులు సామాన్యులను నిలువు దోపిడి చేస్తున్నాయని విమర్శించారు. వైద్య రంగంలోనూ ఫీజుల నియంత్రణ చట్టం అవసరమని తెలిపారు. తెలంగాణలో లక్షలాది మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన 2 లక్షల ఉద్యోగుల భర్తీ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. కొత్త ఉద్యోగుల భర్తీలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు ఎండి ముక్తార్ అబ్బాస్, రవి చారి,అజీముద్దీన్, కార్తీక్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెండు చేతులు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం: బండి సంజయ్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ నియోజకవర్గంలోని బొల్లారం గ్రామంలో వేములవాడ--సిరికొండ రహదారి విస్తరణ పనులకు ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి రూ.22 వేల కోట్ల నిధులు తీసుకువచ్చానని, అందులో రూ.10 వేల కోట్లకు పైగా రోడ్ల నిర్మాణానికే ఖర్చు చేశామని తెలిపారు. కేంద్ర రహదారి మౌలిక సదుపాయాల నిధి ( సిఆర్ఐఎఫ్ ) కింద రూ.23 కోట్లతో చేపడుతున్న వేములవాడ--సిరికొండ రహదారి విస్తరణ పనులు ఆరు నెలల్లో పూర్తవుతాయని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,బిజెపి అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు, రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, ఎర్రం మహేష్, జిల్లా అధ్యక్షుడు రెడ్డివేని గోపి బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ముగిసిన కల్నల్ సంతోష్ బాబు మెమోరియల్ చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్. విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు.





**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 14**

చదరంగం ఆట మాత్రమే కాదని మేదస్సుకు పదును పెట్టి, ఏకాగ్రత వ్యూహాత్మక ఆలోచనలను పెంపొందించే ఒక అద్భుతమైన క్రీడ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ చైతన్య యూత్ క్లబ్ వేదికగా “ఆల్ ఇండియా ఫిడ్ రేటెడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్” ఆదివారం రోజు ఘనంగా ముగిశాయి. వీరుడు, కల్నల్ సంతోష్ బాబు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో, విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వహించిన చదరంగం పోటీల ముగింపు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదరంగం పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తన చేతుల మీదుగా ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ ఎంపిక పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా ముగిసాయి. ?ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ చదరంగం పోటీలు క్రీడకారుల్లో వ్యూహాత్మక ఆలోచనలను మేదస్సును పెంచడంలో ఎంతో దోహదపడుతాయన్నారు. చెస్ క్రీడా కారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ,క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కరీంనగర్ నగరం నుండి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గ్రాండ్ మాస్టర్లుగా ఎదగాలని, చదరంగంలో ప్రతిభను కనబరిచి కరీంనగర్ నగరానికి మంచి గుర్తింపు తీస్కవచ్చేలా క్రీడాకారులు ఎదగాలన్నారు. చదరంగం పోటీల్లో క్రీడాకారులు చతురతతో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ,పోటీల్లో మెలకువలను నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు. దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి అమరుడైన కల్నల్ సంతోష్ బాబు జ్ఞాపకార్థం ఇలాంటి జాతీయ స్థాయి ఎంపిక పోటీలను విశ్వనాథ్ చెస్ అకాడమీ కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. చదరంగం తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహించడంలో కృషి చేస్తున్న విశ్వనాథ్ చెస్ అకాడమీ” నిర్వహాకులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వాహకులు, చైతన్య యూత్ క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్నేహానికి నిలువెత్తు నిదర్శనం.. మిత్రుడి కుటుంబానికి రూ. లక్ష చేయూత




**కరపత్రం ప్రతినిది జమ్మికుంట, జూన్ 14:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణం లో బాల్యమిత్రుడి మరణంతో విషాదంలో మునిగిపోయిన స్నేహితులు తమ ఆత్మీయతను చాటుతూ మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల గుండెపోటు, వడదెబ్బ కారణంగా మృతి చెందిన గుండా సురేందర్ కుటుంబానికి జమ్మికుంట జెడ్పీ ఉన్నత పాఠశాల 1983-84 పదో తరగతి బ్యాచ్ మిత్రులు కలిసి రూ.1 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.గుండా సురేందర్‌తో కలిసి విద్యాభ్యాసం చేసిన బాల్యమిత్రులు తమ స్నేహబంధానికి గుర్తుగా ఈ మొత్తాన్ని ఆయన కుమార్తె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఏర్పాటు చేశారు. మిత్రుడి కుటుంబ భవిష్యత్తుకు తమవంతు చేయూత అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలబడటమే నిజమైన స్నేహమని పేర్కొన్నారు. “మనమంతా స్నేహమేరా జీవితం” అనే నానుడికి అనుగుణంగా ఐక్యతతో ముందుకు సాగుతూ, మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాల్యమిత్రుల సేవాసమితి సభ్యులు మంద వెంకట్ రెడ్డి, కనుమల్ల గణపతి, ఆర్. సంపత్ కుమార్, పెంచలయ్య, కొక్కుల రాజేందర్, డి. రాజేందర్, సాంబయ్య, సమ్మయ్య, గుడిమల్ల బలరాం, ఎ. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.“స్నేహితుడు దూరమైనా.. అతని కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు స్నేహబంధానికి కొత్త నిర్వచనం ఇచ్చారు” అని స్థానికులు అభినందించారు.

## మెదక్ జిల్లా జాతీయమాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా నీరుడు ప్రభాకర్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసిన జాతీయమాల మహానాడు జిల్లా అధ్యక్షులు సంజీవ్

- జాతీయమాల మహానాడు నాయకులకు కృతజ్ఞతలు తెలిపినజిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు ప్రభాకర్
- జిల్లా మాలలకు ఎటువంటి సమస్య ఉన్న తన వద్దకు తీసుకువస్తే అందరికీ తగిన న్యాయం చేస్తాను నీరుడు ప్రభాకర్




**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి మాసాయిపేట జూన్ 13**

మెదక్ జిల్లా జాతీయ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన నీరుడు ప్రభాకర్ ను నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేసిన జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా అందులపల్లి గ్రామానికి చెందిన నీరుడు ప్రభాకర్ కు నియామక పత్రాన్ని అందజేశామని వారు తెలియజేశారు నీరుడు ప్రభాకర్ చదువులోనూ మంచితనంలోనూ మానవత్వంతో కష్టపడి ఉంటూ అందరితో మమేకంగా ఉండి ఏ విషయమునైనా క్షుణ్ణంగా పరీక్షించి తాను ఈ సమస్యకైనా తగు నిర్ణయాలను తీసుకోగల మనస్తత్వం ఉన్న మంచి మనసు అని అతనికి జాతీయమాల మహానాడు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి అర్హుడే అందువలన ఆయనకు మెదక్ జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేయడం జరిగిందని వారు తెలియజేశారు అనంతరం నీరుడు ప్రభాకర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా జాతీయ మాల మహానాడు అధ్యక్షులు సంజీవ్ ఉపాధ్యక్షులు ఆనంద్ జిల్లాయూత్ అధ్యక్షులు దాడిగనరేష్ లకు అందరికీ పత్రిక ముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని తనపై ఎంతో నమ్మకం ఉంచి తనకు మెదక్ జిల్లా జాతీయ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం తనకు ఎంతో సంతోషమని తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి తగు న్యాయం చేస్తానని ఆయన తెలియజేశారు జిల్లాలోని మాలల కులాస్తులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని అందరం జాతీయ మాల మహానాడు నాయకులతో కలిసి మెలిసి ఉంటూ మన కుల జాతిని కాపాడుకునే విధంగానే ఉండాలని మాలలం అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామని మనం కూడా కలిసికట్టుగా ఉంటే సుఖం అనే సామెతను అవలంబిస్తూ ఎవరికి ఎటువంటి కష్టాలు వచ్చిన అందరం కలిసికట్టుగా ఉంటూ మన వారికి వచ్చిన ఆపద లో మనం పాలు పంచుకొని వారికి చేదోడు వాదోడుగా సహాయ సహకారాలు అందిస్తే మనం కూడా అందరి లాగానే భవిష్యత్తు కాలంలో ముందుకు వెళ్లగలమని వారు తెలియజేశారు.

## నాంపల్లి గుట్ట ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు



**కరపత్రం ప్రతినిది వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఆదివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణం, దర్శన మార్గాలు, మెట్ల దారి, క్యూ లైన్లు, మండపాలు, తాగునీటి కేంద్రాలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా శుభ్రత పనులు చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో సానిటేషన్ సిబ్బంది చెత్త తొలగింపు, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పనులను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ పరిశుభ్రత పరిరక్షణలో భక్తులు కూడా భాగస్వాములు కావాలని, చెత్తను నిర్దేశిత డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు.

## రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి

**ములుగు జూన్ 14, కరపత్రం ప్రతినిది**

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, రక్తదానం అనేది మానవత్వానికి ప్రతీక అని, ఒక యూనిట్ రక్తం పలువురు ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. సమాజంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణదాతలుగా నిలవవచ్చని అన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్వీఎం ఆస్పత్రి డీన్ డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ యువత రక్తదాన కార్యక్రమాల్లో ముందుండి పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోపీకృష్ణ, సీఏవో దేవరకొండ శ్రీనివాస్‌రావు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, డైరెక్టర్ రవీందర్ గౌడ్, మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, మెడికల్ కళాశాల విద్యార్థులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

- డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి
- ప్రత్యేక సమగ్ర సవరణ పై నారాయణ్ ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ బిఎల్ఏ లకు అవగాహన కార్యక్రమం
- హాజరైన ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్, టీజీఐఐసి చైర్ పర్సన్, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి లు

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని డిసిసి అధ్యక్షురాలు, టీజీఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్లో టిపిసిసి ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించనున్న సర్ కార్యక్రమంపై బీఎల్ఏలకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఎల్ఏలు కృషి చేయాలన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఈ విషయంలో ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు మాట్లాడుతూ బిఎల్ఏలు సర్ కార్యక్రమం పై అవగాహన కల్పించుకోవడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే విధంగా కృషి చేయాలన్నారు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ట్రైనర్ రాజీవ్, ఫుడ్డు కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్, టిపిసిసి సభ్యులు శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఎల్ఏ లు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 15, 2026

# రక్త దానం చేసి ప్రాణాలు కాపాడుదాం...

- 42 సార్లు రక్తధానం చేసిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు
- ఘనంగా సన్మానించిన కోహెడ ఎస్ ఐ పుల్లెల అభిలాష్






**కరపత్రం ప్రతినిధి కోహెడ, జూన్ 14**

ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కోహెడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు 42 సార్లు రక్త దానం చేసి తన మిత్రులతో కలిసి ఆరు వందల మందికి పైగా ప్రాణాలు కాపాడిన మెగా బ్లడ్ డోనర్ గా గుర్తింపు పొందిన సందర్భంగా కోహెడ ఏస్. ఐ పుల్లెల అభిలాష్ రాజు ని ప్రత్యేకంగా అభినందించారు. కోవిడ్ సమయంలో వంద మందికి ప్లాస్మా అందించి ప్రాణాలు కాపాడగా,వంద మందికి ఉచిత ఆక్సీజన్ అందించారు.గత పద్నాలుగు సంవత్సరాలుగా రక్తదాన చైతన్య యుద్ధంలో ముందుండి, ముప్పై రక్తధాన శిభరాలు నిర్వహించి తలసేమియా భాదిత చిన్నారులకు సామాజిక మధ్యమాల ద్వారా పన్నెండు వేల మందికి పైగా రక్తదానం పై అవగాహనా కల్పించారు. ఆరోగ్యంగా ఉన్నా 18 - 60 ఏళ్ల వయస్సు గల ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాధాతలుగా నిలవాలని రాజు పిలుపునిచ్చారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే మాటను ఆచరణలో చూపుతూ పిడిశెట్టి రాజు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.ఈకార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ కోటి 320డి లో పాక నవీన్ బాబు లయన్‌గా ప్రమాణ స్వీకారం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 14**



సమాజానికి ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా పాక నవీన్ బాబు ని లయన్స్ క్లబ్ ఆఫ్ కోటి 320డి లో అధికారికంగా 'లయన్‌గా' నియమిస్తూ ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.
చుట్టుపక్కల ప్రాంతాల్లో సమాజ సేవకు ప్రాణం పోస్తూ, పేదల సహాయం, విద్యావంతులకు సహకారం అందిస్తూ వస్తున్న పాక నవీన్ బాబు సేవలను లయన్స్ క్లబ్ భారీగా ప్రశంసించింది. ఆయన సేవా తత్వాన్ని గుర్తించి, వాలంటీరింగ్‌లో ఆయన చూపిస్తున్న ప్రతిభకు గాను ఈ గౌరవం లభించింది.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు, జిల్లా అధికారులు మరియు ఇతర సీనియర్ లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. పాక నవీన్ బాబు లయన్స్ జట్టులో చేరడం ద్వారా క్లబ్ బలం మరింత పెరిగిందని, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మందికి సేవ చేయడానికి ఇది దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడం నాకు ఎప్పుడూ గర్వకారణం. లయన్స్ క్లబ్ వంటి గొప్ప సంస్థలో భాగమవడం వల్ల నా సేవలకు మరింత వేగం పుంజుకుంటుంది. అవసరార్థులకు ఎప్పుడూ అండగా ఉంటానని అని ప్రతిజ్ఞ చేశారు.

# రోడ్డు ప్రమాదం.. ప్రాణాలు కోల్పోయిన డాక్టర్, సాఫ్ట్వేర్ ఇంజినీర్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 14**

రోడ్డు ప్రమాదం ఓ డాక్టర్, మరో సాఫ్ట్వేర్ ఇంజినియర్ నీ బలితీసుకుంది.ఈ విషాద ఘటన శనివారం జనగామ (డి) రఘునాథపల్లి(ఎం) గోవర్ధనగిరిలో చోటుచేసుకుంది. హనుమకొండ(డి) నయీంనగర్ కు చెందిన మహ్మద్ రహముద్దీన్ కుటుంబ సభ్యులు, బంధువులు కర్ణాటకలో వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గోవర్ధనగిరి దర్గా సమీపానికి వచ్చాక కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రహముద్దీన్ కూతురు డెంటిస్ట్ హబీబా హఫ్సా(27), బంధువైన సాఫ్ట్వేర్ మహ్మద్ అసదుద్దీన్ (26) మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.



# ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మంద శ్రీకాంత్ ఏకగ్రీవ ఎన్నిక

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 14**



ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో ములుగు జిల్లాలోని గోవిందరావుపేటలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన ఆదివారం తెలిపారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంద శ్రీకాంత్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సహాయ కార్యదర్శి పదవికి ఎన్నుకున్న రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య బలోపేతం కోసం మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యా హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలి

- హెల్త్ కార్డులు, పెన్షనరీ బకాయిలపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 14**





రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెలిశోజు రామమనోహర్ డిమాండ్ చేశారు. వరంగల్ గిర్మాజీపేటలోని సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కాశీబుగ్గ యూనిట్ ఆధ్వర్యంలో యూనిట్ అధ్యక్షుడు ఎం.డి. మదార్ సాహెబ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెల్త్ కార్డుల అమలుకు సంబంధించిన స్పష్టమైన విధివిధానాలు ప్రకటించకుండానే, ఆసుపత్రుల ఎంపిక పూర్తి చేయకుండానే పెన్షనర్ల నుంచి ప్రీమియం మొత్తాలను మినహాయించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షనర్లలో నెలకొన్న అనిశ్చితి, మానసిక ఆందోళనలను తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రు సుధీర్ బాబు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షనరీ బకాయిలు ఇంకా చెల్లించకపోవడం ఆందోళనకరమన్నారు. ఇకపై పదవీ విరమణ పొందే ఉద్యోగులకు పదవీ విరమణ రోజునే అన్ని ఆర్థిక ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ సంఘం సిఫారసులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
జిల్లా ఆర్థిక కార్యదర్శి నిమ్మకాయల సదానందం మాట్లాడుతూ.. పెన్షనర్ల పట్ల ప్రభుత్వ వైఖరి ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాలు, కార్యక్రమాల్లో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, వీరాస్వామి, కుమారస్వామి, భిక్షపతి, ఎన్. సత్యనారాయణ, పెద్దూరి పెద్దన్న, చంద్రమౌళి తదితరులతో పాటు సుమారు 80 మంది యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి గుర్తింపుగా ఆకుల కుమార్‌కు తెలంగాణ ఉద్యమకారుడు అవార్డు

- తెలంగాణ కోసం పోరాడిన ఆకుల కుమార్‌కు ఘన గౌరవం

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 14**




తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ టీఎన్జీవోస్ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారం గ్రామానికి చెందిన ఆకుల కుమార్‌కు "తెలంగాణ ఉద్యమకారుడు అవార్డు" ప్రదానం చేశారు.
2001లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా అనేక ఉద్యమ కార్యక్రమాల్లో ఆకుల కుమార్ చురుకుగా పాల్గొన్నారు. రాస్తారోకోలు, బంద్‌లు, వంటావార్పులు, నిరసన దీక్షలు వంటి పలు ఉద్యమాల్లో ముందుండి పోరాటం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన రైల్వే కేసులతో పాటు, 2009లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ఆందోళనల్లో పాల్గొని కేసులు ఎదుర్కొని జైలు జీవితం కూడా అనుభవించారు.
అంతేకాకుండా గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విశేష సేవలందించిన ఆకుల కుమార్ సేవలను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ ఆయనను అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ మునగాల శాంతి, ఆచార్య పోలోజు రాజ్‌కుమార్, పొడిశెట్టి పద్మావతి, విష్ణువర్ధన్ తదితరులు ఆకుల కుమార్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.
అవార్డు స్వీకరించిన అనంతరం ఆకుల కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తాను చేసిన పోరాటాన్ని, సమాజ సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో మరింత చురుకుగా పాల్గొంటానని పేర్కొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 14**




ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఘనవిజయం సాధించింది. రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 51 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేసి మానవతా చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, ప్రముఖ సంగీత విద్వాంసుడు శ్రీరామ్ కళ్యాణ్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం అనేక మంది ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, అందుకే యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సమాజానికి ఆదర్శంగా నిలిచిన రక్తదాతలను వారు ప్రత్యేకంగా అభినందించారు. తలసేమియా చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివకుమార్‌ల సేవలను రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ జి. కిషన్ రావు, దేవునూరి ఆనంద్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది ప్రదీప్ శర్మ, శివకృష్ణ, శంకర్, చిలువేరు శంకర్, పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, ఉప్పరపల్లి రాజ్‌కుమార్, ఊరటి రవికుమార్, అలువాల పృధ్వి, యాద రవికుమార్, పల్లె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, సేవా కార్యకర్తలు, రెడ్ క్రాస్ సిబ్బంది అందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి: బుచ్చిరెడ్డి

» ప్రతిభకు ప్రోత్సాహం.. సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ లో విద్యార్థులకు నగదు బహుమతులు, ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి ఉప్పల్, జూన్ 14**




పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ లో విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ తో పాటు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎం.మనస్వి,585, ఎం. సాహితీ580, భావన 570, మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృషి గుర్తించి వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో గత 35 సంవత్సరాల నుండి పాఠశాలను నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధిస్తున్నామని తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థులను అన్నిరంగంలో తీర్చి దిద్దుతున్నామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు. నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తమ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానస, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుల ముమ్మర తనిఖీలు
## పోలీస్, రవాణా శాఖల సంయుక్త తనిఖీలు

- విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనలతో జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రవాణా శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సంయుక్తంగా స్కూల్ బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు.

**వాహనాల ఫిట్‌నెస్ పరిశీలన**

వాహనాల ఫిట్‌నెస్, బ్రేకుల పనితీరు, టైర్ల పరిస్థితి, ఎమర్జెన్సీ డోర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు, జీపీఎస్ వ్యవస్థను అధికారులు తనిఖీ చేశారు. పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల భద్రత విషయంలో రాజీపడకుండా ప్రతిరోజూ వాహనాల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. డ్రైవర్ల ఆరోగ్య, మానసిక స్థితిని యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

**యాజమాన్యాలపై చర్యల హెచ్చరిక**

తల్లిదండ్రులు కూడా పిల్లల రవాణా వాహనాల పరిస్థితి, డ్రైవర్ల ప్రవర్తనపై నిఘా ఉంచాలని, లోపాలు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై, నిర్లక్ష్యంగా వ్యవహరించే విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.